క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చీరాల అర్బన్: చీరాల్లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలానే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లున్నాయని, వీటితో పాటు 7,8,10,12 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ కోసం అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. బడిబయట పిల్లలు, బడిమాని వేసిన పిల్లలు, తల్లిదండ్రులు లేనివారు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించండి

చీరాల టౌన్: గ్రామ సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం సూచించారు. శనివారం మండలంలోని దేవాంగపురి, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల అర్జీలు, మొబైల్ యాప్‌డేటా, సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి కేటాయించిన ఉద్యోగుల హాజరు, శాఖల వారీ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సిటిజన్ చార్ట్ ప్రకారం సేవలందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు సాంకేతిక మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖ డీఈ ఏఈఈలు సురేంద్రబాబు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టూరు 132 /32 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నామని చెప్పారు.

ప్లానెట్ పరీక్ష నేడు

అద్దంకి: ఉల్లాస్‌కు సంబంధించి ప్లానెట్ పరీక్షను ఆదివారం మండలంలో నిర్వహించనున్నట్లు ఏపీఎం కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ పరీక్ష కోసం మండలంలోని అంగన్‌వాడీ భవనాలను, పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశామని తెలిపారు. అభ్యాసకులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు, తమకు వీలు కుదిరిన సమయంలో ఒక మూడు గంటల పాటు పరీక్ష రాస్తే సరిపోతుందని తెలిపారు. మండలంలోని 65 సెంటర్లకు అంగన్‌వాడీ వర్కర్లను, గ్రామ సంఘం సహాయకులను ఎంపిక చేశామని తెలిపారు.

25న అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారి మూలవిరాట్

వేటపాలెం: పందిళ్లపల్లి శివారులో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి పంచమ వార్షికోత్సవం ఈ నెల 25వ తేదీన జరగనున్నదని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. అదే రోజు ఉదయం గణపతి పూజ, కుంభ సంప్రోక్షణ, పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నారు. 108 ముత్తైదువులచే 108 జలబిందెల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అష్టోత్తర శతకుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. కోలాట ప్రదర్శన, రాత్రికి కూచిపూడి భరతనాట్య ప్రదర్శన ఉంటాయన్నారు. అనంతరం సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. 26వ తేదీన అమ్మవారికి పొంగళ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశామని తెలిపారు.

దాతల చేయూత అభినందనీయం

అద్దంకి: దాత చేయూత అభినందనీయమని విద్యుత్‌శాఖ మంత్రి గొటిపాటి రవికుమార్ అన్నారు. అసిస్ట్, దాతలు చేయూతతో సమకూర్చిన 40 త్రిచక్ర స్కూటీలను శనివారం ప్రతిభావంతులకు పంపిణీ చేశారు. మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థినికి సైకిళ్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.



ట్రై సైకిల్ స్కూటీలను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి



మాట్లాడుతున్న జడ్జి శాంతి



చీరాల: న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

లైంగిక నేరాలకు పాల్పడితే శిక్ష

చీరాల రూరల్: బాల, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే జైలుకు పంపుతామని.. పోక్సో చట్టం ద్వారా శిక్ష తప్పదని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో శనివారం వీఆర్ఎస్అండ్‌వైఆర్ఎన్ కాలేజీ ఆడిటోరియంలో పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సుధ ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే బాల, బాలికలను వెంటపడి వేధించవద్దని సూచించారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడినట్లయితే ముందుగా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోకిరీలు అప్పటికి కూడా వేధించడం మానకపోతే పోలీసులు, కోర్టుల దృష్టికి తీసుకువచ్చినట్లయితే వారిపై కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతామని చెప్పారు. ఒకచోట చదువుకుంటున్న బాల, బాలికలు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మాదిరిగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఒకరిఎడల మరొకరు దురుసుగా ప్రవర్తిస్తు ర్యాగింగులకు పాల్పడవద్దని సూచించారు. ర్యాగింగులకు పాల్పడి పోలీసులు కేసులు నమోదయితే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని చెప్పారు. మరో ముఖ్య అతిథి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. రెహన మాట్లాడుతూ పోక్సో చట్టంలోని అనేక సెక్షన్‌ల గురించి వివరించారు. బాల, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడిన నిందితులకు పది నుంచి ఇరవై ఏళ్ల వరకు శిక్షలు విధించిన సంఘటనలున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ చెడు మార్గాలను విసర్జించి సత్ప్రవర్తనతో సన్మార్గంలో పయనించాలని సూచించారు. అలానే విద్యార్థిని, విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లి దండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొరవ రమేష్‌బాబు, బార్ మహిళా ప్రతినిధి జి. ఈశ్వరిరెడ్డి, టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సై, పారా లీగల్ వలంటీర్లు ఎస్‌డీ మతిన్, సాయికృష్ణ, డి. ఇమ్మానియేలు, సుభాని, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



చీరాల : న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరైన విద్యార్థులు

పోక్సో చట్టంపై అవగాహన

పర్చూరు(చినగంజాం): విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కనబరచాలని పర్చూరు కోర్టు జడ్జి పి. శాంతి సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం ఉప్పుటూరులోని ప్రభుత్వ హైస్కూల్‌లో పోక్సో చట్టంపై పర్చూరు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు పట్ల మంచి ఆసక్తి కనబరచి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. బాలికలు చెడు ప్రవర్తన వీడి.. మంచి ప్రవర్తన పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా మీతో చెడుగా ప్రవర్తించినట్లయితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అధ్యక్షునిగా జి. వసుంధరాదేవి, ఎం. రవీంద్రరెడ్డి, పి. జాన్ బాబు, న్యాయవాదులు, పర్చూరు ఎస్ఐజే మాల్యాద్రి పాల్గొన్నారు.

చట్టాలు ప్రజలకు రక్షణ కవచాలు

మార్టూరు: మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉన్నప్పుడే అవి వారికి రక్షణ కవచాలుగా ఉపయోగపడతాయని అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగలక్ష్మి అన్నారు. మండల న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో విజయవంతంగా రాణించటం గర్వించదగ్గ విషయమన్నారు. కానీ అనేక సందర్భాల్లో పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందని.. వరకట్నం, గృహహింస, లింగ వివక్షతో కూడిన అసమానతలను మహిళలు అధిగమించాలంటే వారికి చట్టాల పట్ల అవగాహన అవసరమని పేర్కొన్నారు. పసి పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని వారి సంరక్షణలో కీలక బాధ్యత తల్లులదేనని.. పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోలీసు, న్యాయ వ్యవస్థలకు సంబంధించిన చట్టాలను గురించి పేదలకు ఉచితంగా అందించే న్యాయ సహాయాల గురించి అందరూ తెలుసుకోవాలని చెప్పారు. అక్షరాస్యతతో అగ్రగామిగా నిలిచినప్పుడే ఇవన్నీ సాధ్యమని .. ప్రతి మహిళ తమ పిల్లల్ని చదివించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం. శేషగిరిరావు, సుకన్య తండావాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలి

యద్దనపూడి: విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రశాంతి అన్నారు. యద్దనపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పర్చూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కె. ప్రమీల అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రశాంతి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి చెడు ప్రవర్తన మంచి ప్రవర్తన పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవి కాలం సెలవుల్లో చుట్టు పక్కల వారి ప్రవర్తనచో జాగ్రత్తగా ఉండాలని.. చదువుల పట్ల ఆసక్తి కనబరచి మంచి ప్రవర్తనతో ఉండాలని సూచించారు. న్యాయవాది సీహెచ్ శ్రీరమణి, మహిళా పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మార్టూరు తండా వాసులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ లక్ష్మి



యద్దనపూడి: న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ప్రశాంతి

హామీలు నెరవేర్చకపోతే ఉద్యమం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు బాబూరావు, తదితరులు

చీరాల టౌన్: ఎన్నికలకు ముందు బోలెడన్ని హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిన ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే పోరుబాట తప్పదని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబూరావు హెచ్చరించారు. శనివారం సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులు బాబూరావు, ఎం.వసంతరావు, జయరాజ్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, రూరల్ గ్రామాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చి హామీ నెరవేర్చుకోవాలన్నారు. ప్రజల హామీలను నెరవేర్చకుండా, ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంతో వాటి పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరుయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు కోసం ఈనెల 24న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. చీరాల మున్సిపాలిటీలో సీటిపారుదల సమస్యల అనేకచోట్ల వేధిస్తున్నామన్నారు. పేదలకు రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు లేక అవస్థలు పడుతున్న సమస్యలు తమ పర్యటనలో తేలిందన్నారు. పట్టణంలోని దళితవాడల్లో సమస్యలు కునారిల్లుతున్నా వాటికి నిధులు ఇవ్వకపోగా పట్టించుకోవడం లేక దళితులు అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. శ్మశాన వాటికలు చాలక మృతిచెందిన వారి అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. జీవోనెంబర్ 1235 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు తల్లికివందనం, మహాశక్తి, నిరుద్యోగభృతి, మహిళలకు ఉచిత బస్, ఏడాదికి మూడు సిలిండర్లు గ్యాస్ సబ్సిడీపై సక్రమంగా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. 24న జరగనున్న ధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అసెస్మెంట్ పరీక్షకు హాజరు కావాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి మధుసూదనరావు

చినగంజాం: ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాల ద్వారా చదువు నేర్చుకున్న మహిళలంతా అసెస్మెంట్ పరీక్షకు తప్పనిసరిగా హాజరు కావాలని వయోజన విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధుసూదన్‌రావు హాజరు కాగా ఏపీఎం జి. పెద సుబ్బారావు అధ్యక్షత వహించారు. చదువు నేర్చుకున్న మహిళలు సాధించిన పురోగతిని అంచనా వేసేందుకు ప్రభుత్వం ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్ 23వ తేదీ నిర్వహించున్న దృష్ట్యా అందరూ హాజరై పూర్తి చేసుకోవాలని పరీక్ష లబ్ధిదారులకు అందుబాటులో వారి గ్రామాల్లో.. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో వారికి అనువైన ప్రదేశాల్లో జరుగుతుందని తెలిపారు. చదువు నేర్చుకున్న మహిళలు హాజరై రాయాలని కోరారు. డివిజనల్ పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు, వెలుగు సీసీలు, వివిధ గ్రామాల యానిమేటర్లు, వలంటరీ, టీచర్లు పాల్గొన్నారు.

వేగవంతంగా పీఫోర్ సర్వే



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ పద్మావతి

సంతమాగులూరు(అద్దంకి): పేదరికం లేని సమాజం కోసం ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పీ ఫోర్ సర్వేను వేగవంతం చేయాలని చీరాల డీఎల్‌పీఓ పద్మావతి అన్నారు. శనివారం సంతమాగులూరులోని గురిజేపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. జీవన ప్రమాణాల్లో అట్టడుగున ఉన్న 20 శాతం మందిని గుర్తించడమే లక్ష్యమని చెప్పారు. ఈ సర్వేతో ప్రభుత్వ పథకాలపై ఎటువంటి ప్రభావం ఉండదని తెలిపారు. సర్వేలో పేర్కొన్న 27 ప్రశ్నలకు సమాధానాలు యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు.

వాహనాన్ని ఢీ కొన్న కారు

మేదరమెట్ల: ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న ఓ కారు కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి పై ముందు వెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని శనివారం తెల్లవారి జామున ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్ 16 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

క్రమశిక్షణ కోసం స్కౌట్స్ అండ్ గైడ్స్



కొప్పరపాడులో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఎంపికైన విద్యార్థులు

బల్లికురవ: విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహద పడతాయని ఎంఈఓ 2 కె. రమేష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని కొప్పరపాడు, ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను లాంఛనంగా ప్రారంభించారు. 6,7,8 తరగతులకు చెందిన 16 మంది బాలికలు, 16 మంది బాలురను ఎంపిక చేశారు. ఎంఈవో మాట్లాడుతూ సమాజసేవతో క్యాంపుల్లో పాల్గొనడం ద్వారా ఉన్నత విద్య ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందవచ్చన్నారు. క్రమ శిక్షణతో భావి భారత పౌరులుగా గుర్తింపు పొందుతారని.. మూడు సంవత్సరాల పాటు ఈ శిక్షణతో శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. హెచ్ఎం పి. శ్రీనివాసరావు, స్కౌట్స్ మాస్టర్ డి. వెంకటేశ్వర్లు, గైడ్స్ కెప్టెన్ యం. సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం సద్వినియోగం చేసుకోండి



మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు

వేటపాలెం: వేసవి ఎండల తీవ్రత పెరిగినందున పాదచారుల కోసం ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగించు కోవాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో పోలీస్ స్టేషన్ ముందు ఆ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని రూరల్ సీఐ శనివారం ప్రారంభించారు. మొదటి రోజున ప్రజలకు చలివేంద్ర ద్వారా మజ్జిను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువ ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించినందున ప్రజలు తగిన తీసుకోని బయటకి రావాలని సూచించారు. ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కుంటలతో ప్రయోజనం

పర్చూరు(చినగంజాం): పంట కుంటలతో రైతులకు ఎంతో ప్రయోజనం అని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె ఉప్పుటూరు గ్రామంలోని ఫాం పాండ్స్‌ను సందర్శించారు. రైతుల పంట కుంటలను వినియోగించుకోవాలని, ఉపాధి పనులను ఎక్కువగా వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, ఏపీఓ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పీడీ విజయలక్ష్మి

కళ్లజోళ్ల పంపిణీ



విద్యార్థులకు కళ్లజోళ్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ పేరాల అంకినీడు వారి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గత నెలలో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 38 మందికి శనివారం మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాసన్, కార్యదర్శి నల్లూరి కృష్ణ, క్లబ్ సభ్యులు, హెచ్ఎం టి.కృష్ణమోహనరావు, పీవీ బాబు తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్‌ను ఢీకొట్టిన టిప్పర్

● త్రుటిలో తప్పించుకున్న పాస్టర్



టిప్పర్ కింద ఇరుక్కుపోయిన బుల్లెట్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

చీరాల రూరల్ : టిప్పర్ లారీ.. బుల్లెట్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వాహనంపై ప్రయాణిస్తున్న పాస్టర్ త్రుటిలో తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన శనివారం సాయంత్రం స్థానిక పేరాల కారంచేడు రైల్వేగేటు వద్ద చోటుచేసుకుంది. జయంతిపేట జాన్‌ప్యారిష్ లూథరన్ చర్చిలో పాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న చంద్రకాంత్ సాయంత్రం సమయంలో తన బుల్లెట్ వాహనంపై బజారుకు వెళుతున్నాడు. ఈ క్రమంలో కారంచేడు రైల్వేగేటు వద్ద కారంచేడు వైపు నుంచి వస్తున్న ఓ టిప్పర్ లారీ చంద్రకాంత్ బుల్లెట్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో చంద్రకాంత్ ఎగిరి లారీ ముందుపడటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అతని బుల్లెట్ మాత్రం లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయింది. అదే సమయంలో గేటు తీయడంతో గేటుకు రెండువైపులా భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామ్ అయింది.. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు లారీ కింద ఇరుక్కుపోయిన బుల్లెట్‌ను బయటకుతీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇటీవల కొంతకాలంగా టిప్పర్ డ్రైవర్లు నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి టిప్పర్ల ద్వారా గ్రావెల్ మట్టిని తోలుతున్నారని, టిప్పర్ డ్రైవర్లు ఒకరిపై ఒకరు పోటాపోటీలుగా నడుపుతున్నారని, మద్యం సేవించి కూడా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారమణమవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆయా వాహనాలపై పోలీసులు నిఘా ఉంచి అటువంటి వాహనాలను అదుపులోకి తీసుకోవాలని స్థానికులు, పోలీసులకు కోరుతున్నారు.

గొట్టిపాటి హనుమంతరావుకు నివాళి

బల్లికురవ: మాజీ మంత్రి దివంగత గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి వేడుకలు శనివారం బల్లికురవ ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలోని గొట్టిపాటి కాంస్యవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలినేని గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, ధూళిపాళ్ల హనుమంతరావు, దర్శి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం పాల్గుణ మాసం మూల నక్షత్రం అష్టమి తిధి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్ర వారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చీరాల: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనే నినాదంతో ప్రజలను చైతన్యపరుస్తూ కోల్‌కతా నుంచి కన్యాకుమారి వరకు సీఐఎస్ఎఫ్ విశాఖపట్నం సిబ్బంది నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ శనివారం చీరాలకు చేరింది. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు వారికి సాదరంగా ఆహ్వానించారు. ఎనిమిది మహిళలతో సహా 50 మంది సిబ్బంది ర్యాలీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీహరికోట సీఐఎస్ఎఫ్ ఎస్డీఎస్సీ షార్, సీనియర్ కమాండెంట్ సంజీత్‌కుమార్, ట్రైనీ డీఎస్పీ అభిషేక్, రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు విద్యార్థికి గేట్‌లో 81వ ర్యాంకు

జె.పంగులూరు: పంగులూరు విద్యార్థికి గేట్‌లో ఆల్ ఇండియా 81 వ ర్యాంకు వచ్చింది. పంగులూరు గ్రామానికి చెందిన పాతూరి సంజీవరావు కుమారుడు లక్ష్మి శ్రీ సాయి లోకేష్ కు ఈ ర్యాంకు వచ్చింది. పంగులూరు గ్రామస్తులు శనివారం అభినందించారు.